క్లుప్తంగా

మద్యం దరఖాస్తుదారులకు నేడు లాటరీ

గిద్దలూరు రూరల్: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి నేడు ఒంగోలులోని అంబేడ్కర్ భవనంలో లాటరీ ద్వారా దుకాణాలు కేటాయిస్తారని స్థానిక ఎక్సైజ్ సీఐ జయరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 13 షాపులకు గాను 232 మంది దరఖాస్తు చేసుకున్నారని వారంతా ఒంగోలుకు సోమవారం ఉదయం 7.30 గంటలకు తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

కొమరోలు: దసరా సెలవుల అనంతరం సోమవారం నుంచి మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను పునఃప్రారంభిస్తున్నట్లుగా మండల విద్యాశాఖాధికారి బొర్రా వెంకటరత్నం తెలిపారు. దసరా పండుగ సందర్భంగా ఈనెల 3 నుంచి 13వ తేదీ వరకు సెలవులు ఇచ్చారని, అనంతరం పాఠశాలలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి విద్యార్థులను పాఠశాలలకు పంపించాలని కోరారు.

నేటి నుంచి పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాలు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలంలోని 14 నుంచి 20వ తేదీ వరకు పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ చెన్నారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 వ తేదీ కె.ఎస్.పల్లె, కంచిపల్లె గ్రామాల్లో 20న ముండ్లపాడు గ్రామంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

15న మండల సర్వసభ్య సమావేశం

రాచర్ల: ఈ నెల 15వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లుగా ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్. వెంకటరామిరెడ్డి ఆదివారం తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో తప్పకుండా హాజరు కావాలని కోరారు.

స్నేహితుల ఆపన్నహస్తం



స్నేహితురాలికి నగదు అందచేస్తున్న చిన్ననాటి స్నేహితులు

బేస్తవారిపేట: భర్తను కోల్పోయి ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న తోటి స్నేహితురాలికి ఆర్థిక సహకారాన్ని తోటి స్నేహితులు కలిసి అందించారు. బేస్తవారిపేట మండలంలోని పిటికాయగుళ్లకు చెందిన సూరబోయిన రాధకు 1997–98 పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.55 వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. భర్తను కోల్పోయి ఇద్దరు పిల్లలతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తోటి స్నేహితులు గమనించి చేయూతనిచ్చారు. భవిష్యత్‌లో అండగా ఉంటామని భరోసానిచ్చారు.

పోలీసుస్టేషన్‌లో ఆయుధపూజ



పూజలు చేస్తున్న సీఐ సుబ్బారావు, ఎస్సైలు సైదుబాబు, అంకమరావు

మార్కాపురం టౌన్: స్థానిక పోలీసుస్టేషన్‌లో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, ఏఎస్సైలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, మునాఫ్ తదితరుల ఆధ్వర్యంలో ఆయుధ పూజ చేశారు. పోలీసు అధికారులతో అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. పూజల్లో పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మార్కాపురం రూరల్: మార్కాపురం పట్టణ శివార్లలోని గుండ్లకమ్మ నది ఒడ్డున ఉన్న శ్రీలక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీనివాస కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 22 మంది ఉభయదాతలు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారు, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహారావు, ఊటుకూరి రామకృష్ణ, కోశాధికారి పాదర్తి శ్రీనివాసులు తదితరుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నవితరణ నిర్వహించారు.



సోమిదేవిపల్లెలో ముళ్లచెట్లతో నిండిపోయిన డంపింగ్‌యార్డు



నిరుపయోగంగా ఉన్న కాలువపల్లె పంచాయతీ డంపింగ్‌యార్డు

సంపద తయారీ కేంద్రాలకు గ్రహణం



మరమ్మతులకు గురికావడంతో పక్కన పడేసిన రిక్షాలు

- పల్లెల్లో తీవ్రమవుతున్న చెత్త సమస్యలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా డంపింగ్ యార్డులు

రాచర్ల: స్వచ్ఛ సంకల్పం పేరుతో మండలంలోని 14 పంచాయతీల్లో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన సంపద తయారీ కేంద్రాలకు గ్రహణం పట్టుకుంది. వీటిని పంచాయతీల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో నిర్మించారు. అప్పట్లో ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సేంద్రియ ఎరువులు ఉత్పత్తి చేయడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలని భావించారు. ఆ తరువాత వాటిని నిరుపయోగంగా వదిలేయడంతో గ్రామాల్లో ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉంటోంది. సంపద తయారీ కేంద్రాల్లో ఎక్కడా వర్మీ కంపోస్ట్ తయారు కావడం లేదు. చెత్త రిక్షాలు సైతం మూలన పడి తుప్పు పడుతున్నాయి. డంపింగ్ యార్డుల చుట్టూ ముళ్లచెట్లు దట్టంగా పెరిగి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డులను గాలికి వదిలేయడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ద్వారా వీటికి నిధులు మంజూరు చేసి పనులు చేశారు. డంపింగ్‌యార్డులు అందుబాటులో ఉన్నా చెత్త సేకరణ చేయని పరిస్థితిని గ్రామీణులు తప్పుపడుతున్నారు. గ్రామాల్లోని చెత్తను డంపింగ్ యార్డ్‌లకు తరలించి అక్కడ తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలన్న లక్ష్యాలతో నిర్మించిన డంపింగ్‌యార్డులను పట్టించుకునే నాథుడు కరువయ్యారు. దీంతో గ్రామాల్లో చెత్త సమస్యలు తీవ్రమవుతున్నాయి. అధికారులు డంపింగ్‌యార్డులను వినియోగంలోకి తీసుకుని వచ్చి పల్లెల్లో పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మండలంలో డంపింగ్‌యార్డు నిర్మాణాలకు మంజూరైన నిధులు

పంచాయతీ	అంచనా మొత్తం (రూ.లక్షల్లో)
ఆకవీడు	7,41,735
అనుములపల్లె	2,57,454
చినగానిపల్లె	2,88,337
చోళ్లవీడు	3,93,599
యడవల్లి	3,92,860
గౌతవరం	2,43,961
గుడిమెట్ట	3,01,977
జేపీ చెరువు	3,22,915
కాలువపల్లె	2,78,362
ఒద్దులవాగుపల్లె	2,57,509
పాలకవీడు	3,54,797
రాచర్ల	6,92,455
సత్యవోలు	2,51,914
సోమిదేవిపల్లె	2,81,335

జాతీయ స్థాయి క్రీడాకారునికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న గుంటక సుబ్బారెడ్డి, తదితరులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని శివాజీ నగర్‌లో నివాసం ఉండే చిన్నం ఆదినారాయణ అథ్లెటిక్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా క్రీడాకారునికి స్థానిక రీడింగ్‌రూమ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం కార్యదర్శి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు శాసనాల వీరబ్రహ్మం, యక్కలి రమేష్‌ల ఆధ్వర్యంలో అందించారు. త్వరలో జరగబోయే అథ్లెటిక్ జాతీయ పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు వై చలమయ్య, హుస్సేన్‌ఖాన్, యక్కలి కోటి, మొగుళ్లూరి మల్లిఖార్జునరావు, ఎంవీ కృష్ణారావు, గుంటక చెన్నారెడ్డి, కోచ్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

సప్పాలమ్మదేవి దేవాలయంలో చోరీ



కొమరోలు : దేవాలయంలో హుండీని పగులగొట్టిన దృశ్యం

కొమరోలు: ఊరి బయట కొలువై ఉన్న ఓ దేవాలయంలో దొంగలు పడి నగదును దోచుకెళ్లారు. ఈసంఘటన మండలంలోని ఓబులాపురం గ్రామ సమీపంలోని సప్పాలమ్మదేవి దేవాలయంలో శనివారం చోటు చేసుకుంది. సప్పాలమ్మదేవి దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి దేవాలయంలో ఉన్న యాంప్లిఫయర్, హుండీని పగులగొట్టి రూ.5 వేల నగదు దోచుకెళ్లినట్లుగా దేవాలయ నిర్వాహకులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కమనీయం..రంగనాయకుని కల్యాణం



మంగళసూత్రాలు భక్తులకు చూపుతున్న వేదపండితులు

రాచర్ల: రంగనాయక...పాహిమాం..అంటూ భక్తజనం పులకించిపోయారు. వేదపండితుల వేదమంత్రాల సాక్షిగా మంగళవాయిద్యాల నడుమ నెమలిగుండ్ల రంగనాయకస్వామి కల్యాణం అంగరంగ వైభోవంగా నిర్వహించారు. మండలంలోని జేపీ చెరువు గ్రామానికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నల్లమల అడవుల్లో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం ప్రాంగణంలోని కల్యాణ మండపంలో రెండో శనివారం నిర్వహించిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల కల్యాణంలో పాల్గొని పరవశించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.రమేష్‌తో పాటు ఉభయదాతలు పట్టువస్త్రాలతో దేవస్థానం అర్చకులు అన్నవరం పాండురంగాచార్యులు, సత్యనారాయణచార్యులు బృందం కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ బి.నాగ మల్లేశ్వర రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా వేడుకలు



మార్కాపురం : దసరా మండపంలో చెన్నకేశవస్వామివారు



పొదిలి : విజయదుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



పొదిలి : ప్రత్యేక అలంకరణలో పొదిలమ్మ తల్లి



గొట్లగట్టులో అలంకరణలో అమ్మవారు

కంభం: విజయదశమి వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి పారు వేట ఘనంగా నిర్వహించారు. అమ్మవారిశాలలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన శరన్నవరాత్రుల వేడుకలు

కొమరోలు: మండలంలో శరన్నవరాత్రుల వేడుకలు ఆదివారంతో ముగిశాయి. 10 రోజులుగా వివిధ దేవాలయాల్లో ఘనంగా నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కొలువై ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు కొమరోలులోని పురవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కొలువైన శ్రీవారి విగ్రహాన్ని రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం

బేస్తవారిపేట: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని పులివాహనంపై ఉంచి శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు గ్రామోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారి ఉత్సవం వైభవంగా చేశారు. మేళతాళాలతో బాణాసంచా కాల్చుతూ, భక్తిరసమైన నృత్య గానాలతో పట్టణంలోని పురవీధుల్లో గ్రామోత్సవం జరిగింది.

భక్తి శ్రద్ధలతో ఆయుధపూజ

గిద్దలూరు రూరల్: దసరా పండుగ సందర్భంగా స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం సీఐ కె.సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు ఎంతో భక్తి శ్రద్ధలతో ఆయుధపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లోని తుపాకులు, రివాల్వర్లు, ఇతర ఆయుధాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయుధ పూజల విశిష్టత గురించి అర్చకస్వాములు పోలీసులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై జింకా లక్ష్మీరంగయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: దసరా పర్వదినాన్ని మార్కాపురం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు దేవాలయాల్లో విశేష అలంకరణల్లో అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మార్కాపురంలో వాసవీమాతను ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీ జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారు పార్వతీదేవిగా, శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి దేవాలయంలో రమాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, కార్యదర్శి సూరె వెంకట సుబ్బారావు, కోశాధికారి రామడుగు రమేష్ భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఈవోలు చెన్నకేశవరెడ్డి, శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. పోలేరమ్మకు దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక అలంకరణ నిర్వహించి పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని వాహనాలకు పూజలు చేయించారు.

ఘనంగా పార్వేట ఉత్సవం...

శనివారం సాయంత్రం స్వామివారి పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దసరా మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదేవేరులతో కలిసి స్వామివారి ఉత్సవ మూర్తులకు నగరోత్సవం నిర్వహించి మండపం వద్దకు తీసుకొచ్చి పార్వేట నిర్వహించారు. ఉత్సవానికి భక్తులకు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

సాయిబాబా మందిరంలో...

సాయిబాబా మందిరంలో పార్వతీ అమ్మవారిని నవరాత్రుల సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. విశ్రాంత ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో భక్తులకు అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన హోమాల్లో హరిహరరావుతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



పొదిలి : రాజరాజేశ్వరి అలంకరణలో అమ్మవారి ఊరేగింపు



రథంపై ఉన్న వేంకటేశ్వరస్వామి

పొదిలి పట్టణంలో భక్తిశ్రద్ధలతో పూజలు...

పొదిలి: పట్టణంలోని పలు దేవాలయాల్లో దసరా పర్వదినం సందర్భంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారు పలు అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, శ్రీనిర్మమహేశ్వరస్వామి ఆలయం, పొదిలమ్మ గుడి, కంభాలపాడు పోలేరమ్మ దేవస్థానం, శ్రీవేణుగోపాలస్వామి ఆలయం, మార్కాపురం అడ్డరోడ్డులోని శ్రీవిజయదుర్గాంబికదేవి ఆలయంలో ఉత్సవాలు జరిగాయి. అమ్మవారి నగరోత్సవాలు వైభవంగా జరిగాయి. పార్వేట ఉత్సవాలు నిర్వహించారు. కంభాలపాడులో జరిగిన అమ్మవారి ఊరేగింపులో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన దసరా ఉత్సవాలు...

కొనకనమిట్ల: దసరా ఉత్సవాలు వైభవంగా ముగిసాయి. మండలంలోని గొట్లగట్టు, కొనకనమిట్ల, పెదారికట్ల, రేగడపల్లి గ్రామాల్లో రోజుకొక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి గొట్లగట్టు రామాలయంలో వాసవీదేవికి కుంకుమార్చన, గ్రామోత్సవం నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామోత్సవంలో మహిళలు కళశాలు ఎత్తుకుని పాల్గొన్నారు. మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు ఇచ్చి సత్కరించారు. ఆర్యవైశ్య సంఘ మహిళలు ప్రదర్శించిన బోనాల, నృత్య ప్రదర్శన అలరించింది.

తర్లుపాడు మండలంలో...

తర్లుపాడు: మండలంలో దసరా వేడుకలు వైభవంగా జరిగాయి. పలు గ్రామాల్లో శనివారం పార్వేట ఉత్సవం నిర్వహించారు. జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. తర్లుపాడులో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని తిలకించారు.



మార్కాపురం : శమీ వృక్షపూజలో పాల్గొన్న భక్తులు



తర్లుపాడు : శ్రీ వేణుగోపాలస్వామి గ్రామోత్సవం



పొదిలి : పొదిలమ్మ తల్లి దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు



గొట్లగట్టులో బోనాల నృత్య ప్రదర్శన



గొట్లగట్టులో అమ్మవారి గ్రామోత్సవం



బేస్తవారిపేటలో పులివాహనంపై అమ్మవారి ఊరేగింపు



కంభంలో వెంకటేశ్వరస్వామి పారు వేట కార్యక్రమం

సాయిబాబా మందిరాలలో 106వ పుణ్యతిథి పూజలు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

మార్కాపురం: స్థానిక షిర్డీ సాయిబాబా మందిరాలలో విజయదశమి పండుగ సందర్భంగా బాబా 106వ పుణ్యతిథి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నెహ్రూబజారు, జవహర్‌నగర్ కాలనీ, శ్రీసాయినగర్‌లోని సత్సంగ మందిరంలో శనివారం బాబా మందిరం నిర్వాహకుడు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గోపాలుని హరిహరరావు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయంలో విష్ణు, లలితా సహస్ర పారాయణం, గురుచరిత్ర పారాయణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయిబాబా మందిరంలో బాబా పుణ్యతిథిని పురస్కరించుకుని ప్రత్యేకంగా సమాధి అలంకరణ చేశారు. ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, కోశాధికారి నాగరాజు ఆధ్వర్యంలో భక్తులకు చపాతీలు, తీర్థప్రసాదాలు అందజేశారు. సుమారు 500 మందికిపైగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విజయ్, రమణారెడ్డి, రంగప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మార్కాపురం: పట్టణంలోని ఏబీఎం హైస్కూల్లో 1998–99 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనాన్ని శనివారం నిర్వహించగా, ఉత్సాహంగా సాగింది. పాల్గొన్న విద్యార్థులు గత స్మృతులను నెమరువేసుకున్నారు. పదో తరగతిలో తాము చేసిన అల్లరి, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో విద్యార్థులుగా ఉండి ప్రస్తుతం వివిధ హోదాల్లో ఉన్న వారంతా ఆత్మీయంగా పలకరించుకున్నారు. తమకు చదువునేర్పిన ఉపాధ్యాయులు దేవరకొండ లాజరస్, సరోజినీదేవీ, పీఈటీ వరప్రసాద్, ప్రేమకుమార్, వసంత, రాజకుమారి, జ్యోతి ప్రకాష్, రామకృష్ణలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యల్లకర చిన్న, గాలేబు, శివారెడ్డి, శంకర్‌రెడ్డి, కిరణ్ కుమార్, ఖలీల్, సాధిక్, జానీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేరువేరు ప్రాంతాల్లో అనారోగ్యంతో ఇద్దరు మృతి

- నాలుగు రోజుల క్రితం మృతిచెందగా, దుర్వాసన వచ్చి వెలుగులోకి..

మార్కాపురం: వేరువేరు ప్రాంతాల్లో ఒకే తరహాలో అనారోగ్యంతో ఇద్దరు మృతి చెందారు. వారి మృతదేహాలు దుర్వాసన రావడంతో ఆదివారం ఆలస్యంగా ఈ సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. మార్కాపురం పూలసుబ్బయ్య బజార్లోని దసరా మండపం వద్ద ఓ ఇంట్లో ఉంటున్న ప్రైవేట్ కళాశాల లెక్చరర్ తాటిచెర్ల శివప్రసాద్ (50) తరచూ అనారోగ్యానికి గురవతున్నాడు. కుటుంబ సభ్యులకు కూడా దూరంగా ఒక్కడే ఉంటున్నాడు. ఏమైందో ఏమోగానీ.. ఇంట్లోనే శివప్రసాద్ మృతిచెందగా, దుర్వాసన రావడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సైదులు వెళ్లి తాళాలు పగలకొట్టి చూశారు. సుమారు నాలుగు రోజుల క్రితం శివప్రసాద్ మృతి చెందినట్లు గుర్తించారు. శివప్రసాద్ భార్య కోటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పొదిలి మండలం ఏలూరు గ్రామ సమీపంలో...

పొదిలి రూరల్: మండలంలోని ఏలూరు గ్రామ సమీపంలో గల ఆంజనేయ స్వామి గుడి వెనుక మీసాల ఆదినారాయణ (65) మృతి చెంది పడి ఉన్నాడు. ఇతను కూడా నాలుగు రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడి స్వగ్రామం గుడివాడగా చెబుతున్నారు. సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి విచారణ చేస్తున్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారునికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న గుంటక సుబ్బారెడ్డి, తదితరులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని శివాజీ నగర్‌లో నివాసం ఉండే చిన్నం ఆదినారాయణ అథ్లెటిక్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా క్రీడాకారునికి స్థానిక రీడింగ్‌రూమ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం కార్యదర్శి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు శాసనాల వీరబ్రహ్మం, యక్కలి రమేష్‌ల ఆధ్వర్యంలో అందించారు. త్వరలో జరగబోయే అథ్లెటిక్ జాతీయ పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు వై చలమయ్య, హుస్సేన్‌ఖాన్, యక్కలి కోటి, మొగుళ్లూరి మల్లిఖార్జునరావు, ఎంవీ కృష్ణారావు, గుంటక చెన్నారెడ్డి, కోచ్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.